# సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, మార్చి 6 : జిల్లాలో జరిగే సీసీ రోడ్ల అభివృద్ధి పనులు ఎక్కడ కూడా ఆగకుండా పూర్తిచేసి, వాటికి ఎఫ్‌టీఓ జనరేట్ చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలతో టెలికాన్ఫరెన్సు ద్వారా జిల్లాలో జరిగే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడ కూడా ఆగకుండా అనుకున్న అంచనాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి అయిన వాటికి తప్పనిసరిగా ఎఫ్ టీవో జనరేట్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా, ప్రతి గ్రామ పంచాయతీ బిల్డింగ్స్, స్కూల్ కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పెండింగ్ ఉన్న వాటిని సత్వరమే పూర్తి చేసి, పూర్తి అయిన వాటికి తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్లకు మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించి నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

వికారాబాద్, మార్చి 6 : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఓటరు ముసాయిదా తుది జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమావేశం నిర్వహించి ఓటర్ ముసాయిదాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,400 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలు లేవని ఆయన తెలిపారు. ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాత కార్డు స్థానంలో నూతన కార్డు పొందేందుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్నట్లయితే పోస్టల్ ద్వారా కలర్‌తో కూడిన ఎపిక్ కార్డును పొందవచ్చని తెలిపారు. జిల్లాలో తుది చివరి ప్రచురణలో 9,84,068 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది స్త్రీల ఓటర్లతో పాటు 39 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారని ఆయన తెలిపారు. పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లకు గాను 1,33,625 మంది పురుషులు, 1,32,639 మంది స్త్రీలు, 9 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లు ఉన్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు నమోదు కాగా 1,15,019 మంది పురుషులు, 1,16,647 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. తాండూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,849 ఉండగా, 1,18,228 మంది పురుషులు 1,25,614 మంది స్త్రీలు ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గంలో 2,42,267 మంది ఓటర్లలో 1,19,237 పురుష ఓటర్లు ఓటర్లు కాగా, 1,23,020 మంది స్త్రీల ఓటర్లతో పాటుగా 10 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు కలిగి ఉన్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఎన్నికల విభాగం తహసీల్దార్ నరసింహారెడ్డి తోపాటు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సూసైడ్‌పై
# శాఖపరమైన విచారణకు హామీ

**ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎస్సైలపై కేసులు నమోదు**

ఇబ్రహీంపట్నం, మార్చి 6 : ప్రభుత్వ దవాఖాన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జయంత్ సూసైడ్ ఘటన విషయమై శాఖ పరమైన విచారణ చేపడుతామని ఇబ్రహీంపట్నం ఏసీపీ పీవీ రాజు మృతుడి బంధువులకు హామీ ఇచ్చారు. మృతుడు సూసైడ్‌కు ముందు తీసిన సెల్ఫీ వీడియోలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథ్, ఎస్సై మైబెల్లిపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సూపరింటెండెంట్, ఎస్సైలపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో అధికారుల తప్పు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. కాగా, జయంత్ మృతదేహానికి అధికారులు శవపరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించగా బుధవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేటి నుంచి కాశీవిశ్వనాథస్వామి
# బ్రహ్మోత్సవాలు

**శివాలయంలో ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు**
**మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు**





కడ్తాల్, మార్చి 6: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువుదీరిన కాశీవిశ్వనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలకు శివాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గురువారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మహాశివరాత్రి పురస్కరించుకొని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. మూడు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలీపంతూ నాయక్ తెలిపారు. శివాలయం ప్రాగంణంలో రామాలయం, అన్నపూర్ణదేవి, సరస్వతీదేవి, గణపతి ఆలయాలు ఉన్నాయి. అలాగే ఆలయం ముందు ఉన్న పవిత్ర కోనేరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శివాలయానికి రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, మేడ్చల్, వికారాబాద్, నల్లగొండ, వనపర్తి జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో వస్తారు.

**బ్రహ్మోత్సవాల వివరాలు...** మైసిగండి గ్రామంలోని శివాలయంలో మూడు రోజులపాటు కాశీవిశ్వనాథస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. గురువారం విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణం, స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 8న మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, రాత్రికి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకములు, అనంతరం రథోత్సవం, 9న వసంతోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు వివరించారు.

**బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..**



శివాలయంలో నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో తాగునీటి, వసతి తదితర సదుపాయాలు కల్పించాం. మూడు రోజులపాటు వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.
**- స్నేహలత, ఆలయ ఈవో, మైసిగండి మైసమ్మతల్లి, శివాలయం, రామాలయం**



శివాలయం ముందు కోనేరు

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర ఆలయంలో పూజలు**
**నేటి నుంచి 12వ తేదీ వరకు కొనసాగనున్న జాతర**
**ఏర్పాట్లు పూర్తి.. 8న శివపార్వతుల కల్యాణం**



అయ్యసాగరంలోని ఆలయంలో యజ్ఞం చేస్తున్న నిర్వాహకులు, భక్తులు

ఆమనగల్లు, మార్చి 6 : మండలంలోని రామునుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగర క్షేత్రంలో వెలిసిన త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా, పచ్చటి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సర్వదేవతా, అభిషేకాలు, భగవద్గీత పారాయణాలు, దేవయజ్ఞం, ప్రవచనాలు, భజనలు జరిగాయి. కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల నిర్వాహకులు కర్ణాకర్ రెడ్డి, ఆలయ వికాస సంఘం అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, కార్యదర్శి పంచాక్షరీ తదితరులు ఉన్నారు.

# పిటీషనర్‌కు ఓటర్ల జాబితా నజారీ నక్ష అందజేయండి

**ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : భారతీయ జనతా పార్టీకి చెందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఇంటి నెంబర్లతో సహా ఉన్న ఓటర్ల జాబితా నజారీ నక్షను అందజేయాలని ఎన్నికల సంఘానికి హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి అయ్యే ఖర్చును విశ్వేశ్వర్‌రెడ్డి భరించాలని పేర్కొంది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన నజారి నక్షను ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్‌అరాధే జస్టిస్ జె. అనిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటీషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో లక్షల బోగస్ ఓటర్లు ఉన్నారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని షాహీన్ నగర్‌లో 334 ఓటర్లకు చెందిన ఇంటి నెంబర్లు ప్లాట్ నెంబర్లు లేవన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రైవేటు వ్యక్తులతో ఓటర్ల జాబితాలో సవరణలు చేశారని.. ఇందులో తప్పులతడకలున్నాయన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గ సరిహద్దులు, డోర్ నెంబర్లు ఫొటోలతో కూడిన వివరాలున్న నజారి నక్షను ఇవ్వకపోవడంతో అసలైన ఓటర్లను తెలుసుకోలేకపోతున్నామన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేవేళ్ల నుంచి పోటీ చేయాలనుకుంటున్నానని.. నజారీ నక్షను ఇప్పించాలని కోరారు. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ 2024 నాటి డ్రాఫ్ట్ మజారి నక్షను అన్ని పార్టీలకు అందజేశామని తెలిపారు. ఇంకా కావాలంటే దాని ఖరీదును చెల్లిస్తే ఇస్తామన్నారు. వాదనలను విన్న ధర్మాసనం నజారీ నక్షను పిటిషనర్ ఖర్చుపై అందజేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

# గాలికుంటు నివారణ టీకాలు వేయించండి

**జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి అనిల్‌కుమార్**



గాలికుంటు వ్యాధి నివారణ టీకాను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్

వికారాబాద్, మార్చి 6 : పశువుల్లో గాలికుంటు నివారణ టీకాలు వేయిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పశుపోషకులు అందరు తప్పనిసరిగా పశువులకు టీకాలను వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు సోకితే నోటిలో పుండ్లు ఏర్పడి మేత మేయటానికి ఇబ్బంది పడుతాయని, ఈ వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు సోకుతుందని తెలిపారు. పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, పశువులు బలహీనంగా తయారు అవుతాయన్నారు. పశువైద్య సిబ్బంది వచ్చినప్పుడు ఖచ్చితంగా టీకాలు తీయించుకోవాలని రైతులను కోరారు. గ్రామంలో 178 గో జాతి పశువులు, 8 గేదె జాతి పశువులకు టీకాలు వేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి మదన్‌మోహన్, జూనియర్ వెటర్నరీ అధికారి నర్సింహులు, సిబ్బంది రజియోద్దీన్ పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్స్ డీలర్ షాపుల సాంకేతిక తనిఖీ

దోమ, మార్చి 6: ప్రతి ఫెర్టిలైజర్ షాప్‌లో ఎరువుల కొనుగోలు ఈ-పాస్ మిషన్ ద్వారా జరిగేటట్లు చర్యలు చేపట్టి పారదర్శకంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. దోమ మండల కేంద్రంలోని ఆగ్రోస్, రుద్ర ఫెర్టిలైజర్ షాపులను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సాంకేతిక పరమైన తనిఖీ ప్రక్రియలో భాగంగా షాపుల్లో లభ్యతలో ఉన్న స్టాక్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా తయారు చేసిన ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్ యాప్‌తో కూడిన సర్వర్‌తో అనుసంధానమైన వివరాలతో ఎరువులు విక్రయించాలని డీలర్ షాపుల యజమానులకు ఆయన సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, డీలర్ షాపుల యజమానులు పాల్గొన్నారు.



దోమ మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

# చెరువులను ఆక్రమణల నుంచి కాపాడాలి

**కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, మార్చి 6(నమస్తే తెలంగాణ): జిల్లాలోని చెరువులను కబ్జాలకు గురికాకుండా చూడాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ శశాంక ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఆర్డీవో, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఎలను గుర్తించాలన్నారు. ఆక్రమణలు జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత అధికారుల పైనే ఉందని అన్నారు. చెరువులను జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎలు, బఫర్ జోన్లను గుర్తిస్తూ కడీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ఆక్రమణకు గురికాకుండా కాపాడగలుగుతామని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారుచేసి చెరువుల పరిరక్షణకు బాధ్యతగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. అనాథరైజ్డ్ లేఅవుట్ల లిస్ట్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# అబ్దుల్లాపూర్‌మెట్‌లో 'నారి శక్తి అభియాన్'

**మహిళా సాధికార సదస్సుకు**
**హాజరైన బీజేపీ మహిళా మోర్చా మహిళా నాయకులు, నేతలు**






మహిళా సాధికారత పై ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాన్ని స్క్రీన్ పై వీక్షిస్తున్న మహిళలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 6 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బొడిగె సురేఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం 'నారి శక్తి అభియాన్' మహిళా సాధికార సదస్సును మండల కేంద్రంలోని శివ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో ప్రధాని నరేంద్రమోడీ మహిళా సాధికారత పై 10 ఏండ్లుగా మహిళల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలపై ప్రసంగించిన ప్రసంగాన్ని వీక్షించి విన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల మహిళా మోర్చా నాయకులు, మహిళా కార్యకర్తలు, మండల బీజేపీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ పొట్టి శ్రీరాములుయాదవ్, నాయకులు వడ్డెపల్లి పాపయ్యగౌడ్, జంగమయ్యగౌడ్, గోవర్ధన్, అర్జున్‌గౌడ్, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు రమాదేవి, మీనాక్షి, శ్రీలత, సీలోజు శ్రావణ్, సురేష్, రామకృష్ణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ధరణి కమిటీ పర్యటన

- కొద్దిరోజులుగా రంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న కమిటీ
- రైతుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సభ్యులు
- తాజాగా కందుకూరులో పర్యటించిన కమిటీ సభ్యుడు కోదండ రెడ్డి
- కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చునని రైతులకు సూచన
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో రెండు నెలల క్రితమే ధరణి సమస్యలపై అధ్యయనం



కందుకూరులో తహసీల్దారు గోపాల్‌తో చర్చిస్తున్న కోదండరెడ్డి

రంగారెడ్డి, మార్చి 6(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంపై ధరణి కమిటీ దృష్టి సారించింది. వీలైనంత త్వరగా వాటికి పరిష్కారం చూపేందుకు కార్యాచరణను ప్రారంభించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు జరపాలని ధరణి కమిటీ నిర్ణయించింది. ఇందుకు రంగారెడ్డి జిల్లా నుంచి శ్రీకారం చుట్టి కొద్దిరోజులుగా కమిటీ సభ్యులు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్షలు జరపడంతోపాటు రైతులతో సమావేశమై వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు కూడా స్వీకరిస్తున్నారు. ఈ నెల 4న యాచారం మండలంలో కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, సునీల్ కుమార్‌లు పర్యటించారు. 5న ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించగా.. బుధవారం కందుకూరులో కమిటీ సభ్యుడు కోదండరెడ్డి పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ధరణి పెండింగ్ అర్జీల పరిష్కారానికి ఈనెల 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. భూ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తుందని కోదండరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైతులు భూ సమస్యలపై కొత్తగా దరఖాస్తు చేయవచ్చునని, తెల్ల కాగితంపై సమస్యను రాసి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

**రెండు నెలల క్రితమే యాచారంలో అధ్యయనం**

ఈ ఏడాది జనవరిలోనే ధరణి కమిటీ సభ్యుడు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ(లీఫ్స్) సంస్థ భూ సమస్యలపై అధ్యయనాన్ని మొదలు పెట్టింది. తొలుత రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యాచరణను చేపట్టింది. మండలంలోని 21 గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలను నిర్వహించి భూ సమస్యలపై స్టడీ చేశారు. ఈ ఫార్ములాను అనుసరించే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లాలో సుమారు 35వేల వరకు అర్జీలు పెండింగ్‌లో ఉండగా..సీసీఎల్ఏ, కలెక్టర్ నుంచి ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు బదిలీ అయిన దస్త్రాలపై రెవెన్యూ యంత్రాంగం పరిశీలన ప్రక్రియను చేపట్టింది. అధికారుల బృందాలు రెవెన్యూ రికార్డుల్లోని సేత్వార్, ఖాస్రా, పహాణీ, సెస్సాల్ పహాణీ, పాత పహాణీలు, వన్‌బీ, ధరణి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాక తహసీల్దార్, ఆర్డీవోలు ఇచ్చే నివేదికలననుసరించి కలెక్టర్ దరఖాస్తులపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.



# ఎస్పీని కలిసిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 6 : వికారాబాద్ డీఎస్పీగా బదిలీపై వచ్చిన శ్రీనివాస్ రెడ్డి బుధవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ అంజయ్య బదిలీపై వెళ్లారు.